నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. పద్మానగర్, అంజిరెడ్డి కాలనీ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 8 నుంచి 8.30 (అర గంట) గంటల వరకు సాయిరాం నగర్, అంజిరెడ్డి, పద్మానగర్, పవన్‌పురి, విష్ణుపురి, మల్‌రెడ్డి రంగారెడ్డి, కర్మన్‌ఘాట్, క్రాంతినగర్, రాఘవేంద్రనగర్, నిర్మలానగర్, శ్రీనిధి, జ్యోతినగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 35, క్యాబేజీ 18, ఫ్రెంచి బీన్స్ 95, క్యారెట్ 40, దొండ 28, చిక్కుడు 70, గోకర 35, బీట్‌రూట్ 19, క్యాప్సికం 40, ఆలు 28, దోస 15, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 40. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

భౌభౌలతో భయాందోళన!

- గుంపులుగా తిరుగుతూ దాడులు
- ఇంటి నుంచి అడుగుపెట్టేందుకు జంకుతున్న జనం
- ఫిర్యాదు చేసినా స్పందించని జీహెచ్ఎంసీ అధికారులు


మూసారాంబాగ్ ఎస్‌బీహెచ్ కాలనీలో..

బస్తీలు, కాలనీల్లో గ్రామసింహాల స్వైరవిహారం


అక్బర్‌బాగ్‌లో సంచరిస్తున్న వీధి కుక్కలు

మలక్‌పేట: మూసారాంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్లలో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉంది. ప్రధాన రహదారులు, కాలనీ, బస్తీ రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడులు చేస్తున్నాయి. కాలనీకి ఓ కుక్కల గుంపు ఉందంటే ఆశ్చర్య పోనక్కరలేదు. గ్రామ సింహాల స్వైరవిహారం చూసి చూసి చిన్న, పెద్ద, వృద్ధులు ఇంటి నుంచి కాలు బయట పెట్టాలంటే జంకుతున్నారు. ఉదయం పూట కాలనీల్లో తిరుగుతూ రోడ్డు వెంట వెళ్లే వారిని కరుస్తున్నాయి. కుక్కలు మొరుగుతుండటంతో రాత్రి పూట కంటిపై కునుకు లేకుండా పోతున్నదని జనం వాపోతున్నారు.

- ఇళ్లల్లో చొరబడి మనుషులపై దాడులకు తెగబడుతున్నాయి. వాహనాల వెంట పరుగులు పెడుతున్న కారణంగా వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒంటరిగా వచ్చే చిన్నారుల చేతుల్లోని తినుబండారాల కోసం దాడులు చేస్తున్నాయని కాలనీవాసులు చెప్తున్నారు.
- గత మాసంలో మూసారంబాగ్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో లోపలికి వచ్చి ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన తెలిసిందే. వీధి కుక్కల బెడదపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కుక్కల బెడదను తప్పించాలని కోరుతున్నారు.

అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదు



కాలనీల్లో ఎక్కడికి వెళ్లినా కుక్కల గుంపులే కన్పిస్తున్నాయి. వాటిని చూసి బయటికి వెళ్లాలంటే పిల్లలు, మహిళలు, వృద్ధులు భయపడుతున్నారు. కుక్కల బెడదపై సంబంధిత అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేస్తే..జీహెచ్ఎంసీ సిబ్బంది వచ్చి ఒకట్రెండు కుక్కలను పట్టుకున్నారు. ఏదైనా జరిగితే తప్ప అధికారులు స్పందించే స్థితిలో లేరు. ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

– పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, లక్ష్మీనగర్ కాలనీ

పిల్లలను బయటికి పంపాలంటే భయమేస్తోంది



వీధి కుక్కల భయానికి కాలు బయట పెట్టడానికి పిల్లలు జంకుతున్నారు. 5 కుక్కలు వచ్చి మా కొడుకుపై దాడి చేశాయి. భగవంతుడి దయ వల్ల చావు నుంచి తృటిలో భయటపడ్డాడు. పిల్లలను వదలి బయటికి వెళ్లాలంటే భయమేస్తోంది. కుక్కలను పట్టుకుని తీసుకెళ్లాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

– జంపన్న సాయికుమార్, మూసారంబాగ్

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధి ఆదిత్యానగర్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మండల పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. 108 కలశాలతో స్వామివారికి అభిషేక పూజలు, మండల మూలమంత్ర హోమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన సంతోషికుమార్, మోహన్‌రెడ్డి, రవికుమార్, మూర్తి, నాగరాజు, శ్రీధర్, అర్చకులు కొండలాచార్యులు, శ్రీధరాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీకి భారీ మెజార్టీ: కొప్పుల


ఈటల రాజేందర్‌ను కలిసిన కార్పొరేటర్ నర్సింహారెడ్డి తదితరులు

మన్సూరాబాద్: బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ని ఆయన నివాసంలో జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సరళి తదితర వివరాలను ఈటలకు తెలియజేశానని అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీవాసుల్లోని ప్రజలు బీజేపీని ఆదరించారని, భారీ మెజార్టీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీరప్ప పండుగ నిర్వహణకు వసతుల కల్పన

మన్సూరాబాద్: కురుమలు ఘనంగా జరుపుకొనే బీరప్ప పండుగ నిర్వహణకు తన సొంత నిధులతో వసతులు కల్పిస్తున్నానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. పండుగ నేపథ్యంలో బుధవారం మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలోని నిమజ్జన కొలనులోని చెత్తను, నీటిని ఆయన మనుషులను నియమించి తొలగింపజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు 5 రోజుల పాటు బీరప్ప పండుగను కురుమ సోదరులు ఘనంగా జరుపుకుంటారన్నారు. గంగ స్నానాల నిమిత్తం నిమజ్జన కొలను తాజా నీటితో నింపుతామన్నారు. చెరువు నీటి నుంచి దుర్వాసన రాకుండ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ నర్సింహారెడ్డి తెలిపారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు చేపట్టాలి


మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఓయూ జాక్ నాయకులు

మన్సూరాబాద్: హయత్‌నగర్ మండల పరిధిలోని అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓయూ జాక్ నాయకులు భైరు నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం హయత్‌నగర్ మండల విద్యాధికారి హిర్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ, సీబీఎస్ఈ, ఒలింపియాడ్, ఐఐటీ పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. అనుమతులు లేకుండా సమ్మర్ క్లాసులు నిర్వహిస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రైవేటు విద్యాసంస్థల యజమాన్యాలు ప్రతి ఏటా ఇష్టానుసారంగా ఫీజులను పెంచుతున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అనుమతి లేని పాఠశాలలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్‌రాజు, మహేష్‌గౌడ్, పృథ్వీ పాల్గొన్నారు.

భార్యను కడతేర్చిన భర్తకు జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: అనుమానంతో భార్యను రోకలి బండతో మోది చంపిన భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ 11వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వై.జయప్రసాద్ తీర్పు ఇచ్చారు. కోర్టు ఏపీపీ చౌదార్యపు రవికుమార్ కథనం ప్రకారం...ఖమ్మం జిల్లాకు చెందిన భూక్యా సందీప్‌కు 2009వ సంవత్సరంలో రాణితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చి వనస్థలిపురం ఠాణా పరిధిలోని సాహెబ్‌నగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. సందీప్ ఆటో నడుపుతుండగా, రాణి ప్రైవేట్ ఆసుపత్రిలో పని చేసేది. ఇదిలా ఉండగా, తాగుడుకు బానిసైన సందీప్ చీటికీ మాటికీ భార్యను అనుమానిస్తూ శారీరకంగా హింసించేవాడు. 2018 ఫిబ్రవరి 28న మద్యం తాగేసి ఇంటికి వచ్చిన సందీప్ రోకలి బండతో భార్య రాణిపై విచక్షణా రహితంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దాడి విషయం తెలిసి రాణి ఇంటికి ఆమె తల్లి చేరుకుంది. కుమార్తె రక్తపు మడుగులో మృతి చెంది ఉండటం చూసిన ఆమె వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించా రు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖ లు చేయగా, సాక్షాధారాలను పరిశీలించిన కో ర్టు నిందితుడుకి బుధవారం యావజ్జీవ కా రాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

మల్కాజిగిరిలో కాంగ్రెస్‌దే విజయం

కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం హస్తినాపురంలోని తన కార్యాలయంలో ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాము ఏ ప్రాంతానికి వెళ్లినా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు. ప్రజాప్రభుత్వంతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని అన్నారు. గత శాసన సభ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో హామీల్లో ఐదింటిని అమలు చేయడంతో కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వసిస్తున్నారని కార్పొరేటర్ అన్నారు.

డబుల్ బెడ్రూమ్ సముదాయాల అధ్యక్షుడిగా భీమరాజు ఎన్నిక



మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధిలోని ఎరుకల నాంచారమ్మ డబుల్ బెడ్రూమ్ సముదాయాల మెయింటెనెన్స్ కమిటీ ఎన్నికలు బుధవారం పోటాపోటీగా జరిగాయి. అధ్యక్ష పదవికి ముగ్గురు అభ్యర్థులు పోటీ పడ్డారు. మొత్తం 200 సభ్యుల ఓట్లకుగాను 191 ఓట్లు పోలయ్యాయి. గండికోట భీమరాజుకు 91 ఓట్లు, గుంజ బాలరాజుకు 58 , జగన్నాథం గంగయ్యకు 42 ఓట్లు పోలయ్యాయి. భీమరాజు రెండవసారి అధ్యక్షుడిగా 42 ఓట్ల అధిక్యంతో ఘన విజయం సాధించారు. తనపై నమ్మకంతో ఓట్లేసిన సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులతో సమావేశమై పూర్తి కమిటీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట బందోబస్తు


సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన ఎన్నికల అధికారి పంకజ, ఇతర సిబ్బంది

నాగోలు: ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత కోసం నిరంతరం గట్టి నిఘా ఏర్పాటు చేశామని ఎల్‌బీనగర్ నియోజకవర్గం అసిస్టెంట్ ఎన్నికల అధికారి పంకజ తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి బంధించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో భద్రపరిచారు. వాటిని బుధవారం ఎన్నికల అధికారి పంకజ, ఇతర అధికారులు పరిశీలించారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు తాళం వేయించి సీల్ వేశారు. స్ట్రాండ్ రూమ్స్ వద్ద 24 గంటలూ సాయుధ పోలీసుల బందోబస్తు ఉంచడంతో పాటు అనునిత్యం సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, పోలీసులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలకు అడ్డుకట్ట వేయాలి

బడంగ్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్



నాగోలు: గంజాయికి బానిసై యువత చెడు మార్గంలో పయనించడమే కాకుండా ప్రాణాలను కోల్పోతున్నారని, గంజాయి నిర్మూలనకు పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్ ప్రశ్నించారు. బుధవారం ఎల్‌బీనగర్ ఆర్టీసీ కాలనీలో తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గంజాయిని అరికడతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలతోనే సరిపెడుతున్నదన్నారు. గ్రామాల్లో యువత గంజాయికి బానిసలై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల, హాస్పిటల్ లేని గ్రామం ఉంది గానీ, గంజాయి లేని గ్రామం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీసులు గంజాయి విక్రయాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. పోలీసులు, ప్రజాప్రతినిధులు కలిసి గంజాయికి బానిసైన యువతను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

మొయినాబాద్‌రూరల్: యువత అన్ని రంగాల్లో పాలుపంచుకున్నప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారని అంబేడ్కర్ కన్‌స్ట్రక్షన్ సంఘం మండల చైర్మన్ మాల యాదయ్య అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో క్రికెట్ క్రీడాకారులకు ఆ సంఘం ఆధ్వర్యంలో యాదయ్య డ్రెస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. విద్య, ఉద్యోగంతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే మఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. క్రీడలు శారీరక ధారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. క్రికెట్ ఆర్గనైజేషన్ సభ్యుడు నవీన్ ఆధ్వర్యంలో 18 మంది క్రీడాకారులకు మాల యాదయ్య డ్రెస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని పూజలు


ఖిల్లా మైసమ్మ గుడిలో పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన గడ్డం రంజిత్ రెడ్డి భారీ మెజార్టీతో గెల వాలని బుధవారం సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌నగర్‌లోని ఖిల్లా మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల రోజుల పాటు రాత్రింబవళ్లు కష్టపడ్డ కార్యకర్తల కృషి ఫలించాలని ఖిల్లా మైసమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నల్లంగి ధనరాజ్ గౌడ్, బేర బాలకిషన్, బోయిని మహేందర్ యాదవ్, నరసింహ గౌడ్, సంతోష్, కట్ట చిన్న, రంజిత్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంచిరెడ్డిని కలిసిన నాయకులు

తుర్కయంజాల్: బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు బుధవారం కలిశారు. వారితో పోలింగ్ సరళిపై చర్చించినట్లు మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కల్యాణ్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, చిన్నయ్య, వినోద్, పాండు, శ్రీకాంత్ చారి తదితరులు పాల్గొన్నారు.


మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో బీఆర్ఎస్ నాయకులు

నర్సుల సేవలు మరువలేనివి


కార్యక్రమంలో పాల్గొన్న ఓజోన్ హాస్పిటల్ ఎండీ సత్యసాయి ప్రసాద్, గరెత్ వైన్ ఓవేన్

దిల్‌సుఖ్‌నగర్: నర్సుల సేవలు మరువలేనివని ఓజోన్ హాస్పిటల్స్ ఎండీ బీవీ సత్యసాయి ప్రసాద్ అన్నారు. ఇంటర్నేషనల్ నర్సస్ డే సందర్భంగా బుధవారం ఆర్‌కేపురంలోని ఓజోన్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వైన్ ఓవేన్ ముఖ్యఅతిథిగా హాజరై నర్సులకు సర్వేకల్ కేన్సర్ ప్రివెన్షన్ ఫ్రీ వ్యాక్సిన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అందరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్వేకల్ కేన్సర్ గర్భాశయం ముఖ ద్వారానికి సంబంధించి 30 ఏళ్ల వయస్సు పైపడ్డ వారికి వస్తుందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే రాకుండా అరికట్టవచ్చని అన్నారు. గర్భాశయ కేన్సర్‌పై అందరికీ అవగాహన అవసరమన్నారు.

కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి, డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ పూజిత, డాక్టర్ సీ శ్రీనివాసరావు, నర్సులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆలయంలో బుధవారం 108 వెండి కలశాలతో అష్టోత్తర శత కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలంకరణ, రాజభోగ నివేదన, కుంభప్రోక్షణ జరిపారు. ఇలా ఉండగా, మంగళవారం రాత్రి ఆలయంలో చక్రతీర్థం, చిన్న రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పూజల్లో సీఎం ఓఎస్‌డీ వేముల వెంకటేశం, ఆలయ చైర్మన్ సురేష్, ఫౌండర్ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా, కమిటీ సభ్యులు జగన్, అంజయ్య గుప్తా, అరుణ్, ఉపేందర్‌రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.


అష్టలక్ష్మి అమ్మవారికి పుష్పాభిషేకం


అష్టలక్ష్మి ఆలయంలో చక్రతీర్థం నిర్వహిస్తున్న వేదపండితులు

మొక్కల సంరక్షణకు చర్యలు


- ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలి: కమిషనర్ రఘు
- ట్యాంకర్లద్వారా నీటి తడులు



రోడ్డుకు ఇరువైపులా మొక్కలకు నీరు పోస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

బడంగ్‌పేట్: తీవ్రమైన ఎండలు, వడగాల్పులు, ఉక్కపోతల మధ్య ఇండ్లలో ఉండలేని పరిస్థితి. రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి. ప్రజలు సేద తీరడానికి కార్పొరేషన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అందుకనుగుణంగా పార్కుల్లో ఉన్న మొక్కలను పెంచి సంరక్షిస్తుంది. కార్పొరేషన్ పరిధిలో మొక్కలను పెంచే కార్యక్రమం చేపట్టింది. రోడ్డుమధ్య ఖాళీ స్థలం , రోడ్డుకు ఇరువైపుల మొ క్కలు నాటించి ట్యాంకర్ల ద్వారా నీటిని పోయిస్తున్నారు. మొక్కలు విరివిగా ఉండడంతో కాలుష్యం తగ్గడమే కాకుండా స్వచ్ఛమైన గాలి నిస్తుందని నిపుణులు చెబుతున్న విషయమే. దీని కనుగుణంగా ప్రతిఒక్కరూ మొక్కలు పెంచితే భవిష్యత్‌లో ఎండ వేడిమి తగ్గడమే కాకుండా కాలుష్యాన్ని తగ్గిస్తుందని పలువురు చెబుతున్నారు. తదనుగుణంగా బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధికారులు పచ్చదనం లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు చెబుతున్నారు. అందుకే నాటిన ప్రతీ మొక్క ఏపుగా పెరిగి ప్రకృతిలో భాగమైపోతుంది. చల్లని గాలితో పాటు నీడనిస్తుంది. కాబట్టి ప్రాణవాయువు అందించే మొక్కలను బ్రతికించుకోవడం విధిగా భావించాలి. మొక్కల పెంపకం ధ్యేయంగా బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ నడుం బిగించింది. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ కమాన్ నుంచి జిల్లా లైబ్రరీ వరకు రోడ్డు వెడల్పు చేసి సెంట్రల్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్య పాయింట్లలోమొక్కలు నాటిస్తున్నారు. అందులో భాగంగానే మొక్కలు నాటి వాటికోసం ఎరువులతో పాటు ఎర్ర మట్టి పోసి నీటిని పోస్తున్నారు. ముఖ్యంగా ఎండాకాలంలో మొక్కలకు నీరందక ఎండిపోతున్నాయి. దీన్ని గమనించిన అధికారులు వాటర్ ట్యాంకర్లతో నీటిని పోయించి పెంచుతున్నారు. దీంతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను, సిబ్బందిని ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నందనవనాన్ని తలపించేలా..

ఆహ్లాదంగా షాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణ


పచ్చదనంతో కళకళలాడుతున్న కార్యాలయ ఆవరణ


కార్యాలయంలో మామిడి చెట్టు

షాబాద్: షాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణ పచ్చదనంతో కళకళలాడుతోంది. వివిధ రకాల మొక్కలు ఏపుగా పెరిగి ప్రజలకు నీడతో పాటు ఆహ్లాదాన్నిస్తున్నాయి. కార్యాలయ ఆవరణలో గత ఎనిమిది సంవత్సరాల క్రితం హరితహారం కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల మొక్కలు నాటారు. అప్పటి ఎంపీడీఓ పద్మావతి ప్రత్యేక శ్రద్ధ వహించి సిబ్బందితో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీరు పోయించారు. దీంతో నాటిన మొక్కలన్నీ ఏపుగా పెరిగి వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే మండల ప్రజలకు ఆహ్లాదాన్నిస్తున్నాయి. కొన్ని మొక్కలు చక్కని ఫలాలను కూడా ఇస్తున్నాయి. కార్యాలయంలో గత నాలుగు సంవత్సరాల క్రితం అప్పటి జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి నాటిన మామిడి మొక్క ప్రస్తుతం ప్రజలకు మామిడికాయలు అందిస్తోంది.